సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మొక్కల పెంపకం అవశ్యం



చినగంట్యాడ స్కూల్ ఆవరణలో మొక్క నాటుతున్న కార్పొరేటర్ ఏ.జె.స్టాలిన్

అక్కిరెడ్డిపాలెం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని 72వ వార్డు కార్పొరేటర్ ఏ.జె.స్టాలిన్ పిలుపునిచ్చారు. శనివారం వార్డు చినగంట్యాడ ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలో స్టాలిన్ మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా బీట్ ది హిట్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. వేడి, కాలుష్యాన్ని తగ్గించడానికి మొక్కలు నాటాలని నిర్ణయించిందని అన్నారు. ప్రతీ నెలా 3వ శనివారం తప్పని సరిగా మొక్కలు నాటాలని అన్నారు. కార్యక్రమంలో జి.ఆనంద్, మహిళా సమాఖ్యనేత అప్పారి శ్రీలక్ష్మి, జీవీఎంసీ ఏడీ ఎంసీ సూర్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరావు, సెక్రటరీలు శివ, సత్యవేణి, సిబ్బంది గౌరి పాల్గొన్నారు.

పరిశుభ్రత ఆవశ్యకతపై అవగాహన



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న గ్రంథాలయ అధికారి చంద్రకళ

అక్కిరెడ్డిపాలెం: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చునని గ్రంథాలయ అధికారి చంద్రకళ అన్నారు.గాజువాక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం చిన్నారులకు ఆటలు ఆడించడం, నీతి కథలు చెప్పడం, చదివించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. క్రమశిక్షణ అంశాలను వివరించారు. స్వచ్ఛత పాటిస్తామని యువత, చిన్నారులతో గ్రంథాలయ అధికారి చంద్రకళ ప్రతిజ్ఞచేయించారు.

అన్న ప్రసాదానికి విరాళం అందజేత



ట్రస్ట్ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో నిత్య శనివారం జరిగే అన్న ప్రసాదాలకు దాతలు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. శనివారం షీలానగర్‌కు చెందిన కె.జయవెంకటకృష్ణ, జ్యోత్స్న, చిరంజీవి, లవిక దంపతులు రూ.10116 విరాళం ట్రస్ట్ ప్రతినిధులకు అందించారు.

ఎర్నిమాంబ అమ్మవారి సారె ఊరేగింపు



భక్తులు సమర్పించిన సారెతో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అధ్వర్యంలో శనివారం వేకువ జామున సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అచ్చియ్యమ్మపేట నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన మహిళలు, భవానీలు అల్లిపురం, కొబ్బరితోట, రైల్వేస్టేషన్, కాన్వెంట్ కూడలి మీదుగా అమ్మవారి సారె ఊరేగించారు. జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయానికి చేరుకుని పసుపు కుంకుమ, సారె, చీరను అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ ప్రతినిధులు, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మెగా యోగా కార్యక్రమంలో బాలబాలికలు

యోగా.. ఉత్సాహంగా..

• ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ నెల 5 నుంచి ఉక్కు స్టేడియంలో నిర్వహించిన శిబిరంలో సుమారు వెయ్యి మంది బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. 5 నుంచి 20 ఏళ్లలోపు బాలబాలికలకు అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, లాన్ టెన్నిస్, రోలర్ స్కేటింగ్, వాలీబాల్, యోగా అంశాలపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో యోగా గురువు కనకారావు నేతృత్వంలో మెగా యోగా శిబిరం నిర్వహించారు.విద్యార్థులు ఉత్సాహంగా యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో టౌన్ అడ్మిన్ విభాగాధిపతి వై. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

–ఉక్కునగరం

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు



భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలు

పెదగంట్యాడ: ప్రత్యేక అవసరాల గల పిల్లల మనోవికాసానికి, విద్యాభివృద్ధికి, వారిలో చైతన్యం నింపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సమగ్ర శిక్ష జిల్లా సహిత విద్యా సమన్వయకర్త బి.గీత అన్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వేలో భాగంగా శనివారం పెదగంట్యాడ, కణితి, గొంతినవానిపాలెంలో బృందం పర్యటించింది. ఐదుగురు ప్రత్యేక అవసరాల గల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేళ్ల నుంచి 18 ఏళ్లలోపు గల బుద్ధి మాంద్యంతో బాధపడుతున్న పిల్లలను భవిత కేంద్రంలో చేర్పించాలని కోరారు. ఇటువంటి పిల్లలకు బంగారు భవిష్యత్తు ఇవ్వాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీవో అప్పలనాయుడు, మండల విద్యా శాఖాధికారులు ఇ.శ్రీనివాసరావు, కె.రమణాజీ, భవిత కేంద్రం ఉపాధ్యాయులు సూర్యనారాయణ, జయ,భారతి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ పతినిధులు

అగనంపూడి: అనారోగ్యానికి తోడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పెదమడక, చట్టివానిపాలేనికి చెందిన రెండు కుటుంబాలకు సర్వహిత చారిటబుల ట్రస్టు నెలకు సరిపడా బియ్యం, ఇతర రేషన్ సరకులు అందించింది. సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ మాజీ చైర్మన్ గంధోళి నరసింగరావు, వరలక్ష్మి దంపతుల సహకారంతో రెండు కుటుంబాలకు చెరో 25 కేజీల బియ్యం, పప్పులు, చింతపండు, నూనె, సబ్బులు ఇతర వంట సరకులు అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు గుదే సుశీలా గజేంద్రరావు, చైర్మన్ మారా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు చేయూతనిందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సలహాదారు పట్టా రామ అప్పారావు, శీరంశెట్టి గోవిందరావు, బొండా ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భానుడి ప్రతాపానికి గురికావొద్దు



రోగులు, సహాయకులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

అగనంపూడి: భానుడి భగ భగలు రోజు రోజుకూ తీవ్ర రూపం దాల్చుతున్న క్రమంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్పా బయటకు రావద్దని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి, ఆర్ఎంవో డాక్టర్ ఉషా అన్నారు. బీట్ ద హీట్ కార్యక్రమంలో భాగంగా శనివారం అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులకు అవగాహన కల్పించారు. వేసవి తాపం రెట్టింపు అవుతుందని నెలరోజుల పాటు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వడ దెబ్బ తగిలితే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున అలాంటి పరిస్థితుల్లో వెంటనే సమీపంలోని వైద్యశాలను సంప్రదించాలని సూచించారు. కొబ్బరి నీరు, మజ్జిగ, బార్లీ, సబ్జాగింజలతోపాటు తరచూ నీరు తాగుతూ ఉండాలన్నారు. ఉక్కపోత వల్ల చెమట రూపంలో నీరు బయటకు పోయి డీ హైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు గోపీకృష్ణ, లలిత, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, పరిపాలనాధికారి రవిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కచ్చితమైన కొలతలతోనే విక్రయాలు

బీచ్‌రోడ్డు: కచ్చితమైన కొలతలతోనే వినియోగదారులకు విక్రయాలు జరపాలని జిల్లా లీగల్ మెట్రోలజీ జాయింట్ కంట్రోలర్ జి.రాజేష్‌కుమార్ సూచించారు. ప్రపంచ లీగల్ మెట్రోలజీ డేను పురస్కరించుకుని శనివారం సిరిపురంలోని పెట్రోల్ బంక్ వద్ద హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్, బీపీసీఎల్ అధికారులు, అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ మెట్రోలజీ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



ప్రతిజ్ఞ చేస్తున్న ఐటీఐ అధికారులు, నాయకులు

పెదగంట్యాడ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి 3వ శనివారం బీట్ ది హీట్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు పత్రీజీ పిరమిడ్ ట్రస్ట్ ముందుకు రావడం అభినందనీయమని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అన్నారు. ప్రభుత్వ న్యూ ఐటీఐలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీఐ ఆవరణలో చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మీసాల శివ గణేశ్వరరావు, ఐటీఐ ఏపీ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌వీ రమణ, ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఎస్.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదగంట్యాడ: మదీనాబాగ్ 33కేవీ ఫీడర్ పరిధిలో వైర్ల మార్పు పనులు చేపట్టనున్న నేపథ్యంలోఈ నెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని పిట్టవానిపాలెం రైల్వే క్రాసింగ్, పిట్టవానిపాలెం ప్రాంతంలో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు నిర్వాసిత కాలనీల్లో బైక్ ర్యాలీలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు, కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కునగరంతో పాటు అన్ని నిర్వాసిత కాలనీల్లో బైక్ ర్యాలీలు నిర్వహించనున్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఈ నెల 20న సమ్మె నిర్వహించడానికి కార్మిక సంఘాలు, కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు సన్నద్ధం అవుతున్నాయి. ఇందులో భాగంగా సమ్మె ఆవశ్యకతను తెలియజేయడానికి బైక్ ర్యాలీలు ఏర్పాటు చేశారు. అగనంపూడి కాలనీ, వడ్లపూడి, కూర్మన్నపాలెం, గంగవరం, పెదగంట్యాడ, ఉక్కునగరం, 77వ వార్డులో నిర్వహించనున్న ర్యాలీల్లో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గోవాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌గా ప్రతీక్ తన్వర్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా ఢిల్లీకు చెందిన ప్రతీక్ తన్వర్ నియమితులైనట్టు తెలిసింది. స్టీల్‌ప్లాంట్ బోర్డులో ఫంక్షనల్ డైరెక్టర్లతో పాటు కొంత మంది ఇండిపెండెంట్ డైరెక్టర్లు కూడా ఉంటారు. ఇండిపెండెంట్ డైరెక్టర్లను కేంద్ర ప్రభుత్వం తమకు నచ్చిన వారిని నియమిస్తుంది. ఇందులో భాగంగా ఢిల్లీకి చెందిన న్యాయవాది ప్రతీక్‌ను నియమించినట్టు సమాచారం. కేంద్ర ఉక్కుమంత్రిత్వశాఖ త్వరలో ఉత్తర్వులు జారీ చేయనుంది.

అప్పన్నకు ఘనంగా నిత్యకల్యాణం



అప్పన్నకు యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర నేడు



యాత్ర కోసం విశాఖ చేరుకున్న రథాలు

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా 'శ్రీసత్యసాయి ప్రేమ ప్రవాహిని' పేరిట దేశమంతటా పవిత్ర రథ యాత్ర నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 18న నగరంలో రథయాత్ర జరగనున్నట్లు సంస్థ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రలో పాల్గొనే రథాలు విశాఖ చేరుకున్నాయి. ఆదివారం సాయంత్రం 4 గంటలకు పెదవాల్తేరులోని కరకచెట్టు పోలమాంబ ఆలయం నుంచి రథయాత్ర ప్రారంభం కానుంది. శాంతి ఆశ్రమం, లాసన్స్ బే కాలనీ, ఉషోదయ కూడలి మీదుగా ఎంవీపీ కాలనీలోని సత్యసాయి ప్రేమ సదన్ మందిరానికి చేరుతుంది. అనంతరం అక్కడ సత్యసాయి సేవా సంస్థల ఏపీ అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు భక్తులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు.

భెల్‌లో ఆక్టోపస్ మాక్ డ్రిల్





ఆక్టోపస్ సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న సౌత్ ఏసీపీ త్రినాథ్

భెల్ (హెచ్‌పీవీపీ)లో ఆక్టోపస్ సిబ్బంది శనివారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద కార్యాకలపాలు, దుష్ట శక్తుల నుంచి భారీ సంస్థలను ఎలా కాపాడుకోవాలో విన్యాసాల ద్వారా అవగాహన కల్పించారు. దీని ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలు రక్షణ వలయంలో ఉన్నాయన్న సంకేతాలు తీసుకువెళ్లడమే లక్ష్యమన్నారు. ఆక్టోపస్ అధికారి రాజారెడ్డి ఆధ్వర్యంలో విన్యాసాలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, గాజువాక సీఐ పార్థసారథి సంస్థకు చేరుకుని ఆక్టోపస్ సిబ్బందిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

- అక్కిరెడ్డిపాలెం

సమ్మెతో స్టీల్ యాజమాన్యాన్ని ప్రతిఘటిస్తాం



ధర్నాలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సమ్మెతో ప్రతిఘటిస్తామని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు హెచ్చరించారు. ఈ నెల 20న కార్మిక సమ్మె నేపథ్యంలో శనివారం ఉక్కు పరిపాలన భవనం కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధానకార్యదర్శి డి. ఆదినారాయణ మాట్లాడుతూ యాజమాన్యం వైఖరికి వ్యతిరేకంగా నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ మూడు నెలలుగా లాభాలు ఆర్జిస్తున్నప్పటికీ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించలేదన్నారు. కార్పొరేటర్ బి. గంగారావు మాట్లాడుతూ ప్యాకేజీ పేరిట స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం మోసం చేస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కె.ఎస్.ఎన్.రావు, పి.వి. రమణమూర్తి, రామస్వామి, గణపతిరెడ్డి, డి.వి. రమణారెడ్డి, రామ్‌కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల సంసిద్ధత ఉత్సవాలు



తల్లిదండ్రుల సమక్షంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులు



అక్కిరెడ్డిపాలెంలో పాఠశాల సంసిద్ధత ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం పాఠశాల సంసిద్ధత ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సంసిద్ధత ఉత్సవాల అంశాలను తెలిపే ప్లకార్డులు ప్రదర్శిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గణిత, సాంఘిక, భాషా, శారీరక, సృజనాత్మకత, అభివృద్ధి గురించి స్టాల్స్ పెట్టి తల్లులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల సమక్షంలో రిజిస్ట్రేషన్ చేయించుకుని తద్వారా తదుపరి తరగతికి నమోదు చేయించుకున్నారు. జిల్లా ఐటీసీ ప్రథమ్ కో ఆర్డినేటర్ డి.ప్రమీల మాట్లాడుతూ పిల్లలు జూన్ 12న ప్రథమ తరగతిలో చేరే విధంగా దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో పెందుర్తి సీడీపీవో డి.నీలవేణి, సూపర్‌వైజర్ రుక్సానా బేగం, గ్రామ పెద్దలు సంద్రాన రామారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.దుర్గాబాయి. సీత, కనకరత్నం, నానిజయ, సుజాత, చిన్నమ్మలు, పుష్పలత, వెంకటరత్నం, ఈశ్వరమ్మ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే ఏజీఎం తనిఖీలు



అరణ్యలో సదుపాయాలను పరిశీలిస్తున్న ఏజీఎం మోహెస్‌కుమార్ బెహరా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ మోహెస్ కుమార్ బెహరా శనివారం వాల్తేర్ డివిజన్‌లో పర్యటించి, తనిఖీలు చేపట్టారు. విశాఖపట్నం పోర్ట్ ఏరియా, అదాని గంగవరం పోర్ట్ ప్రాంతాల్లో పర్యటించి అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను, సైడింగ్, లోడింగ్ పాయింట్స్, ఇతర సదుపాయాలను, పలు కీలక ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం విశాఖ పోర్ట్ అథారిటీ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు, పరిశీలించి, రేక్‌ల సామర్థ్యాన్ని పెంచి కార్గో రవాణాకు మరింత ప్రోత్సాహమివ్వాలని ఆయన కోరారు. రైల్వే నుంచి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందజేస్తామన్నారు. అనంతరం వాల్తేర్ డివిజన్ భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాల వేదిక అరణ్యను పరిశీలించారు. ఈ ప్రదేశంలో క్లైంబింగ్ వాల్, టైర్ వాల్, టైర్ టవర్, రోప్ క్లైంబర్, హర్డిల్‌పాసర్, టైర్ క్రాసింగ్, మంకీ బ్రిడ్జి, కమాండో బ్రిడ్జి, టైర్ టన్నెల్, మౌగ్లీ జంపింగ్, ఫుట్ వాకర్ వంటి సౌకర్యాలను పరిశీలించారు. వీటిని స్కాట్స్ అండ్ గైడ్స్ సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. డీఆర్ఎం లలిత్ బోరా, ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), సీనియర్ డివిజనల్ ఇంజినీర్ (కో ఆర్డినేషన్) ఏకే మహరాణా, పోర్ట్ సీఈవో అమిత్‌మాలిక్, ఇతర సీనియర్ అధికారులు, వాల్తేర్ డివిజన్ సీనియర్ అధికారులు, ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.